క్లుప్తంగా

పల్లెల్లో ఆధ్యాత్మిక పవనాలు



రామేశ్వరంలో మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పల్లెల్లో గ్రామ దేవతల ఉత్సవాలతో ఆధ్యాత్మిక పవనాలు వీస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. రామేశ్వరంలో కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందిన మహాలక్ష్మి అమ్మవారి తీర్థం గురువారం వైభవంగా జరిగింది. దీనికి హాజరైన ఎమ్మెల్యేకు సర్పంచ్ కొటికలపూడి చినబాబు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలు సుభిక్షంగా, సిరి సంపదలతో ఉండాలంటే గ్రామ దేవతల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు. అనంతరం అన్నసమారాధనకు మండల నలమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఏపీత్రయం పీఏసీఎస్ చైర్మన్ గుండా ఈశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ కోలాలోవ, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ నాయకుడు కోటికలపూడి గణేష్, గ్రామ కన్వీనర్ గాజుల మణికంత, రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ దుళ్ల వీరవెంకట సత్యనారాయణ, నాయకులు కొటికలపూడి గోపి, నక్కా రాజు, కె.వెంకటరమణ పాల్గొన్నారు.

రేపు సాయంత్రం 6 గంటల వరకే ప్రచారం

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రం 6 గంటలతో ముగియనుంది. ఆపై ఎవ్వరూ ప్రచారం చేయడం, సభలు, ఊరేగింపులు నిర్వహించడం చేయరాదని రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఈనెల 12, 13 తేదీలలో ఇచ్చే పత్రికా ప్రకటనలకు అనుమతులు తప్పనిసరన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు ఎన్నికల ప్రచారాలు ఉండరాదన్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చన్నారు. ఓటరు స్లిప్‌తోపాటు గుర్తింపుకార్డు వెంట తీసుకురావాలన్నారు.

సంక్షేమ పథకాలతో సమాజాభివృద్ధి



కోరుకొండలో ప్రచారం చేస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం

మధురపూడి: జగనన్న సంక్షేమ పథకాలు సమాజాభివృద్ధికి మూలాలని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రూ.1,7 73 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు, రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావుతో గల స్నేహంతో ఎన్నికల ప్రచారానికి కోరుకొండ వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటువేయాలని కోరారు. ఆయనను స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం కోరుకొండ అధ్యక్షుడు బొండాడ చందు, సెక్రటరీ కారుమూరి బాబ్జీ, జాయింట్ సెక్రటరీ సత్యవరపు సుధీర్, సభ్యులు పాల్గొన్నారు.

వర్షంతో వర్జీనియా పొగాకుకు తీవ్రనష్టం



ముగ్గళ్లలో వర్షానికి పాడైపోయిన పొగాకు పంట

సీతానగరం: మూడు రోజుల క్రితం కురిసిన అకాల వర్షంతో వర్జీనియా పొగాకుకు తీవ్ర నష్టం కలిగింది. అధిక వర్షంతో పంటపొలాల్లో నీరు నిలిచింది. వరి, మొక్కజొన్న పంటలు ఒబ్బిడి అయినా, వర్జీనియా పొగాకు క్యూరింగ్ దశలో ఉండి రెండు రెలుపులు పూర్తి చేసుకుంటుండగా నష్టం వాటిల్లింది. పొలంలో నీరు నిలిచి ఉండటంతో పొగాకు మొక్కలు తలలు వాల్చివేశాయి. దీనితో మొక్క వారం రోజులకు కుళ్లిపోతుంది. మొక్క నుంచి ఆకులు రెలుపు జరిపినా ప్రయోజనం ఉండదు. మండలంలో రఘుదేవపురం, ముగ్గళ్ల, వెదుళ్లపల్లి, కాటవరం తదితర గ్రామాల్లో సుమారుగా వంద ఎకరాలలో నష్టం కలిగిందని అంచనా.

డ్రైనేజీలో పసికందు మృతదేహం

కంబాలచెరువు: ఆర్యాపురంలోని సాయి ఆస్పత్రి వద్ద ఉన్న డ్రైనేజీలో గురువారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో పసికందు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గుర్తుతెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన ఆడపిల్లను డ్రైనేజీలో పడేసినట్టు భావిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పసికందు మృతదేహాన్ని బయటకు తీసి, ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేశారు.

ప్రగతి పథం.. తుఫ్యాన్ వేగం

- ప్రచారంలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- భారీ మెజార్టీయే లక్ష్యం
- ప్రతిపక్షాలలో వర్గవిభేదాలు
- డీలా పడిన బత్తుల

రాజానగరం: ఏటిపట్టు, మెట్ట ప్రాంతాలు కలిసి ఉన్న రాజానగరం నియోజకవర్గం పార్టీ పరంగానే కాకుండా అభిమానుల పరంగా కూడా జక్కంపూడి కుటుంబానికి మంచి పట్టున్న నియోజకవర్గం. అందుకనే ఏమోగాని ఇక్కడ నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా పోటీపడుతున్న జక్కంపూడి రాజా జనమే తన జీవనాడిగా చేసుకుని ఐదేళ్లు శాసన సభ్యుడిగా, ప్రతి కుటుంబంలోనూ ఒక సభ్యుడిగా మెలుగుతూ నియోజకవర్గ ప్రజానీకానికి విశిష్టమైన సేవలందించారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేపట్టని రీతిలో రూ.1773 కోట్లతో అనేక అభివృద్ధి పథకాలను చేపట్టి నియోజకవర్గాన్ని ముందంజలో నిలిపారు. చెప్పింది చేయడమే కాదు, చేపట్టిన కార్యం పూర్తయ్యేవరకు విశ్రమించని యోధుడిగా పనిచేయడం వల్లనే ఇంతటి అభివృద్ధి సాధ్యమైందనే విషయాన్ని ప్రతిపక్షాలు సైతం ప్రశంసిస్తుంటాయి. అయితే ఎన్నికల సమయంలో ఇప్పుడు ఆ విధమైన ప్రశంసలు ఇవ్వలేక, జరిగిన అభివృద్ధిని కాదనలేక, లేనిపోని ఆరోపణలు చేస్తూ ఎలాగైనా సరే జక్కంపూడిపై విజయం సాధించాలని తాపత్రయపడుతున్నాయి. దివంగత నేత, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు తనయుడిగా రాజకీయ ఆరంగేట్రం చేసిన రాజా ప్రత్యర్థుల విమర్శలకు సున్నితంగానే సమాధానాలిస్తూ, తనదైన ప్రచార సరళిలో దూసుకుపోతూ ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నారు.

సీఎం జగన్ సభతో కేడర్‌లో జోష్

కోరుకొండలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన మేమంతా సిద్ధం బహిరంగ సభ తరువాత కేడర్‌లో మరింత జోష్ పెరగడమే కాకుండా జనావళిలో అభిమానం మరింతగా పెరిగింది. ఎన్నికల ఫలితంలో కోరుకొండ సభ కీలకమవుతుందనే ప్రచారం ఎక్కువగా ఉంది. సామాజికవర్గ సమీకరణల పరంగా రాజానగరం, కోరుకొండ మండలాలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. ఈ రెండు మండలాలలో అత్యధికంగా ఉన్న సామాజిక వర్గానికి చెందిన వారే ఇక్కడ ప్రధాన అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు.

అభివృద్ధి పనులు

సిట్టింగ్ ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజా గడచిన ఐదేళ్లలలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, కోరుకొండ, సీతానగరం మండల రైతాంగం ఎదుర్కొంటున్న గోదావరి వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం, గ్రామాలలో తాగునీటి సమస్యకు పరిష్కార చర్యలు తీసుకోవడం, గోదావరి నీటిని ఇంటింటికీ తాగునీరుగా అందించే కార్యక్రమాన్ని చేపట్టడం, శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధితో పాటు 170 ఆలయాల అభివృద్ధికి నిధులు సమకూర్చడం, కోరుకొండ వాసుల చిరకాల వాంఛ అయిన అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయడం, సీతానగరంలో పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అభివృద్ధి చేయించడం తదితర అభివృద్ధి పనులు చేపట్టారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా (ఫైల్)

ప్రభుత్వ పరంగా రూ.1,337 కోట్లతో అందించిన సంక్షేమ పథకాలతో పాటు సామాజికవర్గ సమీకరణలు కూడా ఆయన విజయానికి తోడు కానున్నాయి. దీనితో పాటు చెక్కుచెదరని ఆడపడచుల అభిమానం మరింత తోడై మంచి మెజార్టీతో గెలుపును సొంతం చేసుకునే దిశగా జక్కంపూడి రాజా అడుగులు వేస్తున్నారు.

చేరికల పాత్ర కీలకం

మరో ఆరు మాసాలలో ఎన్నికలు జరుగుతాయనే ప్రచారం ఉన్నప్పటి నుంచీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కేడర్ మరింత బలోపేతమయ్యేలా ఇతర పార్టీల నుంచి వలసలు ప్రారంభమయ్యాయి. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఉంటూ సీనియర్ నేతగా పేరొందిన మేడా గురుదత్త ప్రసాద్, 2019 ఎన్నికలలో ఆ పార్టీ అభ్యర్థిగా రాజానగరం నుంచి పోటీ చేసిన రాయుడు చిన్న, ఆ పార్టీ కోరుకొండ మండల కన్వీనర్ మండపాక శ్రీను, రాజానగరం ప్రతినిధి వడ్డి చిన్న వంటి వారు చేరడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఈ వలసలు ఆ పార్టీ ఓటర్ల పై తీవ్ర ప్రభావం కూడా చూపాయి. ఈ కారణంగా ఇప్పటికీ జనసేనతో పాటు టీడీపీ నుంచి వలసలు వైఎస్సార్ సీపీలోకి వస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫ్యాను వేగం మరింతగా పెరిగింది.

సకుటుంబ సమేతంగా ...

ఎన్నికలలో విజయం సాధించాలంటే అభ్యర్థి మంచితనంతో పాటు సరైన ప్రణాళికతో కూడిన ప్రచారం ఉండాలి. అటువంటి ప్రచార సరళిలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దూసుకుపోతున్నారు. ఆయన తల్లి జక్కంపూడి విజయలక్ష్మి, సతీమణి డాక్టర్ రాజశ్రీ, తమ్ముడు జక్కంపూడి గణేష్, అతడి భార్య సుకీర్తి నియోజకవర్గంలో నాలుగు వైపులా ప్రచారం నిర్వహిస్తున్నారు. డిజిటల్ ప్రచారంలోను తమదైన శైలిని ప్రదర్శిస్తున్నారు.

మూడు పార్టీల దత్తుడు బత్తుల

కోరుకొండ మండలం గాదరాడ నుంచి స్థానిక ఎన్నికలలో ఎంపీటీసీ పదవికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బత్తుల వెంకటలక్ష్మి భర్తే ప్రస్తుత ప్రత్యర్థి, జనసేన పార్టీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ. కోరుకొండ మండల పీఠాన్ని అందించలేదనే అలకతో పార్టీ ఫిరాయించిన ఆయన రాజానగరం అభ్యర్థిగా జనసేన టిక్కెట్టు పొందడానికి కూడా పార్టీ ఫండ్ పేరుతో భారీగానే చెల్లించుకున్నారు. అయితే వ్యక్తిగతంగా సొంత గ్రామమైన గాదరాడలోనే కాకుండా నియోజకవర్గంలోనూ పెద్దగా పట్టులేని బత్తుల.. టీడీపీ, బీజేపీల సహకారంతో ఏవిధంగానైనా సరే గెలవాలని తాపత్రయపడుతున్నారు. ఇదే సమయంలో మూడు పార్టీలు కలసి బూరుగుపూడిలో ఏర్పాటు చేసిన ఉమ్మడి సమావేశం రసాభాసై, జరగకుండా రద్దు కావడం ఆ మూడు పార్టీలలోనూ కొంత నిస్తేజాన్ని ఏర్పరచింది. టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న బొడ్డు వెంకట రమణ చౌదరి ఫొటో లేకుండా బత్తుల తన ఫొటోనే ఫ్లెక్సీలపై వేసుకోవడం ఈ రాద్ధాంతానికి కారణం. అతడి ప్రవర్తనతో ఇమడలేక, అతడితో అడుగులు కలపలేని కొంత మంది జనసైనికులు ఆ పార్టీ నుంచి తప్పుకుని వైఎస్సార్ సీపీలో చేరి, తమ సత్తా ఏమిటో చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇక టీడీపీలోనూ అదే పరిస్థితి కనిపిస్తుంది. ఈ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ ఈ ఎన్నికలకు పూర్తిగా దూరంగా ఉన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం

- వచ్చే ఎన్నికల్లో విజయం మనదే
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాష్ట్రంలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాజుపాలెం గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెదపూడికి చెందిన టీడీపీ యూత్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన కాకర ఏసుబాబు, అప్పసాని రామకృష్ణ, కాకర శ్రీను, రాయుడు కుమార్‌రాజు,రాపర్తి తరుణ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేశారన్నారు. ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి నిజాయితీని మెచ్చి పార్టీలోకి చేరామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 13న జరిగే ఎన్నికల్లో రాష్ట్రంలో జగన్ ముఖ్యమంత్రిగా, అనపర్తిలో తాను ఎమ్మెల్యేగా గెలవడం తథ్యమన్నారు. పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, సర్పంచ్ గుత్తుల పుష్పవతి, ఉప సర్పంచ్ నాగుమళ్ల వీరభద్రరావు, మండల పరిషత్ విప్ సమ్మంగి దుర్గాప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పప్పు సింహాచలం, పార్టీ గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు, కట్టా రమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

బిక్కవోలు: ఐదేళ్ల పాటు పేదలకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీకి ఎన్నికల్లో పట్టం కట్టాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బిక్కవోలు, ఇలపల్లి, రంగాపురం, కాపవరం గ్రామాల్లో ఉపాధి కూలీలను కలుసుకుని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర ప్రజల బాగు కోసం సీఎం జగన్ వందల సార్లు బటన్లు నొక్కారని, ఇప్పుడు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కాలని ఓటర్లను కోరారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో స్థానం దక్కించుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు మంచి చేస్తుంటే ఓర్వలేక అన్ని పార్టీలు ఏకమై జగన్‌ను ఓడించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించాలన్నారు. కాపవరం సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, నాయకుడు గువ్వల సత్తిరెడ్డి పాల్గొన్నారు.

- పందలపాకలోని శ్రీవల్లీ దేవసేన సమేత ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి గండి వాసు విస్తృతంగా ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మాస్క్ ధరించి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి అవ్వా, తాతలను కలుసుకున్నారు.



రాజుపాలెంలో వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



జి.మామిడాడలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి



కాపవరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పేదలకు మేలు

పెదపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందరికీ మంచి జరిగిందని, ఫ్యాను గుర్తుకు ఓటేసి తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి కోరారు. గురువారం జి.మామిడాడలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ జగనన్నతోనే పేదంటికి వెలుగు వచ్చిందన్నారు. అనపర్తిలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. తన భర్తకు గతం కంటే భారీ మెజార్టీ అందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. జి.మామిడాడలో టీడీపీ సీనియర్ నేత మేడపాటి చిన్న దొర, ఆయన అనుచరులు, మరి కొంతమంది నందిక అబ్బులు, ప్రకాశం, విజయకుమార్, రమేష్, అచ్చన్న తదితరులు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి ఆదిలక్ష్మి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చిన్న దొర మాట్లాడుతూ సీఎం జగన్, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి పార్టీలో చేరామని తెలిపారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతా వరలక్ష్మి, చింతా దొరబాబు, సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకటపద్మావతి, నాయకులు మేడపాటి వీర్రెడ్డి ఫ్రెండ్స్, కర్రి రామ సుబ్బారెడ్డి, పడాల అమ్మిరెడ్డి, మేడపాటి బుల్లి సూరయ్య పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

పెదపూడి: ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కోరారు. జి.మామిడాడలో జగనన్న కాలనీ, పుట్టకొండ తదితర గ్రామాల్లో ఆయన ప్రచార రథంపై విస్తృతంగా పర్యటించారు. ఆయన మాట్లాడుతూ మళ్లీ జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, నాయకులు ద్వారంపూడి వెంకటరెడ్డి, కేతా శ్రీను, మండ రాజారెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి, పుట్టకొండ సర్పంచ్ వల్లు వెంకటరమణ, టి.మణికంఠ పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి కృషి



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాల ఉన్నతి సాధ్యమైందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సింగంపల్లిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం రాత్రి టీడీపీ పార్టీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ కొండేపూడి అప్పలస్వామి, మాజీ మండల ఉపాధ్యక్షుడు పేపకాయల వెంకటేశ్వర్లు, సిరిగినెడ్డి లక్ష్మణ్, మరికుర్తి వీరబాబు, లింగంపల్లి వాసు, యానాల వీరబాబు, దేవు సత్తిబాబు, ఎస్‌కే కాజా, కోసూరి రాజు, గొల్లపల్లి అప్పారావు, కొట్టు వీరబాబు, పేపకాయల నాని, యర్రంశెట్టి వీరయ్య, తదితర కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమ్మ ఒడి, చేయూత, చేదోడు, ఆసరా, వాహన మిత్ర, రైతు భరోసా, కాపునేస్తం వంటి అనేక పథకాలు అమలులోకి వచ్చాయన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులు ఇప్పుడు అమలు కాని హామీలన్నీ ఇస్తున్నారన్నారు. అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సర్పంచ్ టి.శివశంకర ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



మునికూడలిలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో జక్కంపూడి విజయలక్ష్మి, ప్రసాదరాజు

సీతానగరం: వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని, రాజన్న రాజ్యం మళ్లీ వస్తుందని ఆ పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మునికూడలిలో గురువారం ఇతర పార్టీలకు చెందిన 40 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని విజయలక్ష్మి, మాజీ గ్రంథాలయ చైర్మన్ బైర్రాజు ప్రసాదరాజు సాదరంగా ఆహ్వానించారు. మాడుగుల నాగభూషణం, బుంగా నితిన్, కొల్లి ఏసు, ముప్పిడి సోమరాజు, మాడుగుల అబ్బులు, బుంగా పెద్ద, ఆరుగోలి అరవాలు, బుంగా నవీన్, కొల్లి అబ్బులు, కొడమంచిలి ఏసు, కొల్లి అర్జయ్య తదితరులతోపాటు 40 మంది జక్కంపూడి విజయలక్ష్మి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆమె మాట్లాడుతూ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాజానగరం నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారన్నారు. ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను గెలిపించాలని కోరారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని జక్కంపూడి విజయలక్ష్మి, బైర్రాజు ప్రసాదరాజు ప్రారంభించారు. ఎంపీటీసీ నూతంగి ధనలక్ష్మి, పార్టీ నాయకులు కవల కృష్ణమూర్తి, ఆకుల సత్యనారాయణ, కవల దుర్గం, అమ్మిరెడ్డి ఏసు, అంబటి రాజు, కొల్లి చిరంజీవి, నూతంగి నాగన్న దొర, యలమాటి అనిత, రేలంగి సూర్యారావు పాల్గొన్నారు.

అభివృద్ధి కొనసాగాలంటే జగనే సీఎం కావాలి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- విస్తృతంగా ఎన్నికల ప్రచారం

రాజానగరం: పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి జగన్ సీఎం కావాలని, అందుకు మీరంతా ఈ ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని దివాన్‌చెరువు, శ్రీరామపురం, రఘునాథపురం, భూపాలపట్నంలలో రాజమండ్రి ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల వారికి ప్రజలు హారతులు పడుతూ, పూలవర్షం కురిపించారు. జై జగన్, జై జక్కంపూడి నినాదాలతో ప్రచారాన్ని హోరెత్తించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. ఆ విధంగా మేలు జరిగిందనుకుంటేనే మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ఓటు వేయాలన్నారు. రాష్ట్రం అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందాలని సీఎం జగన్ భావించారని, ఆయన స్ఫూర్తితో తాను నియోకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పాటుపడ్డానన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో రాష్ట్రం ప్రగతి పథంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక ప్రాధానత్యనిచ్చారన్నారు. భావితరాలకు బంగారు భవితను అందించేలా పాఠశాల విద్యలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ప్రత్యేక విజన్ కలిగిన జగన్ మరో ఐదేళ్లు సీఎంగా ఉండాలని, అందుకు మీరంతా ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి, ఆశీస్సులు అందించాలని కోరారు. ప్రచారంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్, చిత్రంలో మేడపాటి షర్మిలారెడ్డి

భౌతిక శాస్త్ర ప్రయోగాలపై వేసవి శిక్షణ

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భౌతిక శాస్త్ర ప్రయోగాలపై వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ మేరకు గురువారం కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి కోమల లక్ష్మి, అకడమిక్ సమన్వయకర్త డాక్టర్ సంజీవ్ కుమార్, అధ్యాపకుల సమక్షంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కోమల లక్ష్మి మాట్లాడుతూ 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ మొదట, ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు ఉపయోగపడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి 11:30 వరకు భౌతిక శాస్త్రంలో మౌలిక అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కేవలం 50 మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. కోర్సు, ఫీజు వివరాలకు కళాశాల భౌతిక శాస్త్ర వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. మరిన్ని వివరాలకు అధ్యాపకులు డాక్టర్ ఈసుబ్ బాషా 97059 64213, దుర్గాలక్ష్మి 94914 19667లను సంప్రదించాలన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, అధ్యాపకులు

రైతులకు చేరేలా కార్యక్రమాలు రూపొందించాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కృషి విజ్ఞాన కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలు, టెక్నాలజీలు రైతులకు చేరేలా ఉండాలని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్‌ఐ) ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. స్థానిక సీటీఆర్ఐ సమావేశ మందిరంలో గురువారం కలవచర్ల కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రీయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాగంటి శేషుమాధవ్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందే విధంగా రైతులకు ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించాలని కోరారు.

హైదరాబాద్ భారత వరి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.ముత్తురామన్ మాట్లాడుతూ పసుపు, మిరప, ఆముదం, అశ్వగంధ మొదలైన పంటలపై ప్రదర్శనలు, క్షేత్రస్థాయి పరిశీలనలను చేపట్టాలని సూచించారు. కేవీకే హెడ్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు సేద్య పంటలు, పశు విజ్ఞాన విభాగాల గత సంవత్సర ఫలితాలను, రాబోయే సంవత్సరం (2024)లో చేపట్టవలసిన కార్యక్రమాలను సభ్యులకు తెలిపారు. ఉద్యాన పంటల అధికారి జీవీఆర్ సత్యవాణి, సస్యరక్షణ అధికారి టి.విజయ వర్ధన్ ఆయా విభాగాల ఫలితాలను ప్రజెంట్ చేశారు. ఈ సందర్భంగా బైపాస్ ఫ్యాట్ (అన్నాశయ రక్షిత కొవ్వు) అనే పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా ఉద్యాన పంటల అధికారి బి.సుజాత కుమారి, ఎస్వీ యూనివర్సిటీ పశుసంవర్థక విభాగం హెడ్ డాక్టర్ బి.ఈశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి డా.కృష్ణారావు, రాజమండ్రి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ నరసింహరావు పాల్గొన్నారు.



బైపాస్ ఫ్యాట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శేషుమాధవ్, ముత్తురామన్ తదితరులు

గోదావరిలో యువకుడి మృతదేహం



కంబాలచెరువు: పుష్కరాల రేవు వద్ద గోదావరిలో సుమారు 27 గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని మూడో పట్టణ పోలీసులు గురువారం గుర్తించారు. పుష్కర్ ఘాట్ సమీపంలోని బ్రిడ్జి కిందకు యువకుడి మృతదేహం కొట్టుకురావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని వెలికితీశారు. ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో తెలపాలని కోరారు. ఎస్సై ఎస్ఎస్.రంగనాథుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.